సాక్షి
మహబూబ్‌నగర్
శుక్రవారం ‌। 20 ‌। జూన్ ‌। 2025



ఇసుక క్వారీలో..
దుందుభీ వాగు నుంచి ఇసుక తరలింపు కోసం కొందరు గొడవకు దిగారు.
వివరాలు 10లో ▸



అక్రమ నిర్మాణాల తొలగింపు
సిర్సనగండ్ల ఆలయ స్థలంలో అక్రమ నిర్మాణాలను గురువారం తొలగించారు.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 36.0 /23.1
వాతావరణం
ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఎండ కాస్త పెరుగుతుంది. సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

ప్రకటనలు సరే.. వసతులేవి?

పలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు
- మరుగుదొడ్లు, తాగునీరు, తరగతి గదులు, వంటగదుల్లేక ఇబ్బందులు
- శిథిలావస్థకు చేరిన పైకప్పులు
- ఇంకా చెట్ల కింద సాగుతున్న చదువులు
- అమ్మ ఆదర్శ పాఠశాలలు, మన ఊరు–మనబడిలో అరకొర పనులు

సాక్షి విజిట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేస్తామంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ప్రచార ఆర్భాటంగా మిగిలిపోతున్నాయి. జిల్లావ్యాప్తంగా చాలా సర్కారు బడులు వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. శిథిలావస్థకు చేరిన భవనాలు, ఇరుకైన తరగతి గదులు, చెట్లకింద పాఠాలు, అసంపూర్తిగా భవన నిర్మాణాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకేంద్రంతో పాటు మారుమూల గ్రామాల్లోని అనేక బడుల్లో పైకప్పు సైతం సరిగ్గా లేని పరిస్థితి. గురువారం 'సాక్షి' బృందం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను విజిట్ చేయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కాగా.. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన కోసం 2023–24 విద్యా సంవత్సరంలో మన ఊరు–మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అలాగే 2024–25 విద్యాసంవత్సరంలో మరోసారి ప్రభుత్వం అమ్మ.. ఆదర్శ పాఠశాలలు పేరు మీద మరో పథకం తీసుకొచ్చినప్పటికీ అనుకున్న స్థాయిలో వసతులు సమకూర్చలేకపోయారు.

■ **ప్రస్తుతం** వర్షాకాలం కావడంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం వల్ల చాలా చోట్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కొన్ని చోట్ల మధ్యాహ్న భోజనం వండేందుకు అవసరమైన వంట షెడ్డు లేకపోవడం వల్ల ఆరుబయటే వంట చేయాల్సి వస్తోంది. వర్షం వస్తే ఇబ్బందులు తప్పవు. వీటితో పాటు కొన్ని పాఠశాలలో వందల సంఖ్యలో విద్యార్థులు ఉన్నప్పటికీ వారి సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. విద్యార్థులు మరుగుదొడ్లకు వెళ్లేందుకు క్యూలైన్‌లలో నిలబడి వెళ్లే పరిస్థితి ఉంది. సరిపడిన తరగతి గదులు లేకపోవడంతో వరండాలో, చెట్లకింద బోధన చేస్తున్నారు. ఒకే గతిలో రెండు తరగతులు సైతం నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 90 పాఠశాలల్లో పలు రకాల ఇబ్బందులు ఉన్నాయి. వీటిని వెంటనే పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఆరు దశాబ్దాల పాఠశాల దుస్థితి..



రేకుల గదులు



ఒకే గదిలో రెండు తరగతుల నిర్వహణ

జడ్చర్ల పాతబజార్‌లో ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఐదో తరగతి వరకు ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో మొత్తం ఆరు గదులు ఉండగా.. రెండు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. మరో రెండు రేకుల గదులున్నాయి. వాటిలో ఒక గదిని విద్యార్థుల బ్యాగులు పెట్టుకోడానికి మాత్రమే వినియోగిస్తుంటారు. ఒక గదిలో రెండు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక ఉన్న రెండు సిమెంట్ స్లాబ్ గదులు సైతం శిథిలావస్థలో ఉన్నాయి. ఒక గది ఎప్పుడు పడిపోతుందో తెలియని స్థితిలో ఉండటంతో దానిని స్టోర్ రూంగా వినియోగిస్తున్నారు. మరో గదిలో మూడు తరగతులు కొనసాగిస్తున్నారు. వర్షం పడితే సిమెంట్ రేకుల రంధ్రాల నుంచి వర్షం కారుతుండడంతో విద్యార్థులను ఇళ్లకు పంపించాల్సిన పరిస్థితి. ఇక కొత్తబజార్ ప్రాథమిక పాఠశాల పరిసరాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి. కావేరమ్మపేట పాఠశాల గేటు తాళం విరగ్గొట్టి లోపల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చుకున్నారు. నల్లాలు విరగొట్టి.. పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారు.

– జడ్చర్ల టౌన్



దేవరకద్రలో ప్రహరీ లేని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల

ఆరు బయటే..



మిడ్జిల్ ఉన్నత పాఠశాలలో ఆరుబయట చెట్ల కింద చదువులు



అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణం

మిడ్జిల్ ఉన్నత పాఠశాలలో 500 మంది విద్యార్థులున్నారు. వారిలో 300 మంది బాలికలున్నారు. బాలికల కోసం 12 మరుగుదొడ్లు మంజూరయ్యాయి. కానీ రెండేళ్లుగా పూర్తి కాకపోవడంతో వారు బాలుర మరుగుదొడ్లను వాడుకుంటున్నారు. బాలురు ఆరు బయటకు వెళుతున్నారు. అలాగే పాఠశాల భవనంలో గదులు శిథిలావస్థకు చేరడంతో ఆరుబయట రెండు తరగతుల విద్యార్థులకు ఆరుబయటే చదువులు బోధిస్తున్నారు.

– మిడ్జిల్

భయం గుప్పిట్లో బడి

నవాబుపేట మండలం రంగంపల్లి ప్రాథమిక పాఠశాలను 40 ఏళ్ల క్రితం నిర్మించగా.. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరింది. ఉన్న ఒక గదికి మధ్య లో గోడ పెట్టి రెండు గదులుగా మార్చారు. అందులో ఒక చోట 1, 2 తరగతులు, మరో చోట 3, 4, 5 తరగతులు నిర్వహిస్తున్నా రు. పాఠశాల భవనం బయట పెచ్చులూడి నెర్రెలు వారిం.. మొక్కలు మొలిచాయి. ఎప్పుడు కూలిపోతుందేమోననే భయం గుప్పిట్లోనే నిత్యం బడి సాగుతోంది.

– నవాబుపేట



నెర్రెలు వారిన రంగంపల్లి పాఠశాల భవనం



ఒకే గదిలో కొనసాగుతున్న మూడు తరగతులు



తరగతి గదిలో మర్రి వేర్లు (ఇన్‌సెట్‌లో)

ఒకే గది.. ఐదు తరగతులు



దేవరకద్రలోని హరిజన్‌వాడలోని ప్రాథమిక పాఠశాలకు ఒకే గదిలో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం కూడా శిథిలావస్థకు చేరింది. గతంలో ఇక్కడ 130 మంది విద్యార్థులు ఉండగా..పాఠశాల గదులు లేకపోవడం వల్ల 65 మంది మాత్రమే ఉన్నారు. మన ఊరు– మన బడి పథకం కింద ఈ పాఠశాలకు ఎంపిక చేసి రూ.41 లక్షలు మంజూరు చేశారు. అయితే టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్.. నిధులు సరిపోవని పనులు చేపట్టలేదు. – దేవరకద్ర రూరల్

వసతులున్నా.. విద్యార్థులు కరువు

భూత్పూర్ మండలం పాత కప్పెట ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నాడు. గురువారం ఒక విద్యార్థి హాజరు కాకపోవడంతో ఉన్న ఒక్కడికే ఉపాధ్యాయులు పాఠాలు బోధించారు. లోక్యాతండా ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు ఉండగా.. ఇద్దరు డుమ్మా కొట్టారు. ఉన్న నలుగురికి పాఠాలు బోధించారు. ఈ రెండు పాఠశాలల్లో వసతులున్నా.. ఏకోపాధ్యాయ పాఠశాలలను గ్రామస్తులు ఇక్కడ తమ పిల్లలను చేర్పించడం లేదు.

– భూత్పూర్



పాత కప్పెట పాఠశాలలో ఉన్న ఒక్క విద్యార్థికి పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ప్రహరీ లేని పాఠశాల

దేవరకద్రలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేదు. ఇక్కడ 400 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. 20 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని చేసిన ప్రయత్నాలు సఫలం కావడం లేదు. ఎండోమెంట్ పరిధిలో ఉన్న రెండెకరాల స్థలంలో ఈ పాఠశాలను గతంలో నిర్మించారు. అయితే కాంపౌండ్ వాల్ కోసం సరిహద్దు ఏర్పాటు చేయడానికి అధికారులు ముందుకు రాకపోవడం లేదు. పలుమార్లు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేదు.

– దేవరకద్ర

న్యూస్‌రీల్

బాలల హక్కులకు రక్షణే ముఖ్యం: డీపీఓ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బాలల హక్కుల రక్షణకు అందరూ కృషి చేయాలని డిస్ట్రిక్ట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీపీఓ) రవి అన్నారు. గురువారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బాలల రక్షణ కమిటీకి సంబంధించిన వాల్‌పోస్టర్లు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికులు, వెట్టి, బాల్య వివాహాలపై ముందుగా ఎవరికైనా సమాచారం అందితే వెంటనే పోలీసులకు లేదా తమకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ రవికుమార్ యాదవ్, పీఎల్‌వీలు నాగభూషణం, ఎ.రాజసింహుడు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్ భూములకు రక్షణ కల్పించాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగర శివారులోని సర్వే నం.942, 943, 944లో 3.26 ఎకరాల వక్ఫ్ భూమి ఉందని, దీనికి సరైన రక్షణ కల్పించాలని టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖలీల్, ఇమాన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సలీం డిమాండ్ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండానే దీనిలో నుంచి కొన్ని నెలలుగా ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ అధికారులు భూత్పూర్–చించోళి బైపాస్ నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు వారు గురువారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా బాధ్యులైన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. గతంలో ఈ భూమిలో కొందరు ముస్లింలు లీజుకు తీసుకుని వ్యవసాయం చేశారని పేర్కొన్నారు. దీనిని సరైన పద్ధతిలో ఉపయోగించుకుంటే అనేక మంది యువకులకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పీర్ల పండుగ (మొహర్రం) నిర్వాహకుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.గట్టన్న, టీఎఫ్‌టీయూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు పి.విజయకుమార్, జమాతే ఇస్లామియా నాయకుడు మీర్జా బదివుల్లా, మైనారిటీ నాయకులు హసన్‌దావూస్, మహమ్మద్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,277

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మొక్కజొన్న క్వింటాల్ గరిష్ఠంగా రూ.2,227, కనిష్ఠంగా రూ.1,500 ధర పలికింది. వేరుశనగకు రూ.3,566 ఒకే ధర, ధాన్యం హంస రకం గరిష్ఠంగా రూ.1,841, కనిష్ఠంగా రూ.1,649, ఆర్‌ఎన్‌ఆర్ గరిష్ఠంగా రూ.2,119, కనిష్ఠంగా రూ.1,689 ధరలు లభించాయి.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



ఉంద్యాల జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ కింద కేటాయించే స్థలాన్ని అన్ని వసతులతో వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిర అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండాపూర్, తుమ్మలకుంట తండా, రేగడిపట్టి తండా, చిన్నగుట్ట తండా, శామగడ్డ తండా, ఒంటిగుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు, అవార్డు అందుకున్న వారందరికీ పునరావాసం కింద 300 గజాల స్థలం చొప్పున ఇచ్చే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అక్కడ నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ స్కూల్, అంగన్‌వాడీ, ఫంక్షన్ హాల్ వంటి ఇతర మౌలిక వసతుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, స్పెషల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీఓ నవీన్, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తాం

చిన్నచింతకుంట: రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. చిన్నచింతకుంట మండలం అమ్మాపురంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును పరిశీలించారు. రైతుల ఫిర్యాదులను వెంటనే విచారణ చేపట్టి పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. రైతులు ఎలాంటి సమస్యలున్నా సదస్సులో ఫిర్యాదు చేస్తే తక్షణ పరిష్కారం దొరికే అవకాశం ఉందని తెలిపారు.

పాఠాలు బోధించిన కలెక్టర్

కలెక్టర్ విజయేందిర ఉంద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాసేపు విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, మౌలిక వసతులు, పరిసరాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు.బాగా చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. ఆమె వెంట తహసీల్దార్ ఎల్లయ్య, ఆర్ఐ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్‌పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. నిజామాబాద్‌లో ఈనెల 28 నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలను గురువారం జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ ఫుట్‌బాల్‌లో జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నిరంతర ప్రాక్టీస్‌తో క్రీడల్లో ఉన్నత స్థానాల్లో చేరుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్యాట్రన్ రంగారావు, భానుకిరణ్, కోశాధికారి కేఎస్.నాగేశ్వర్, కార్యనిర్వాహక కార్యదర్శి ఇమ్మాన్యుయెల్ జేమ్స్, నందకిషోర్, శ్రీనివాస్, వాజిద్, నికేష్, రాజు, రాము, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా '100 రోజుల ప్రణాళిక'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగర పరిధిలో ఈ నెల 2 నుంచి 'వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక' ముమ్మరంగా సాగుతోంది. మున్సిపల్ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో నిత్యం ఆయా డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి తడి, పొడిచెత్తను వేరుచేసి స్వచ్ఛ ఆటోలకే ఇవ్వాలని అవగాహన కల్పిస్తున్నారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, సీజనల్ వ్యాధులు, వీధికుక్కల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాలు, ఓపెన్ ప్లాట్లలో చెత్తాచెదారం వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నారు. ఈపాటికే ఇలాంటి వారిని గుర్తించి నోటీసులు అందజేస్తున్నారు. మరోవైపు మెప్మా ఆధ్వర్యంలో స్థానిక పండ్ల దుకాణదారులు, వీధి వ్యాపారుల వద్దకు వెళ్లి కామన్ ఇంట్రెస్ట్ గ్రూపు (సీఐజీ) లో చేరాలని సూచిస్తున్నారు. దీనివల్ల బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురు లింగం ,రవీందర్‌రెడ్డి, వజ్రకుమార్‌రెడ్డి, మెప్మా ఇన్‌చార్జ్ డీఎంసీ ఎం.లక్ష్మి, సీఓలు పాల్గొంటున్నారు.

జైలు శిక్ష ఖరారు.. అంతలోపే తప్పించుకున్న నిందితుడు
- గంట వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు

జూరాలలో జోరుగా విద్యుదుత్పత్తి
- 11 యూనిట్లలో 435 మెగావాట్ల ఉత్పత్తి

- వివరాలు 10

వెన్నాచేడ్ పెద్ద చెరువు లీకేజీలమయం

- వివరాలు 11

నేడు 'తెలంగాణ అర్బన్ స్టార్టప్ చాలెంజ్' సదస్సు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీడీఎంఏ టీకే శ్రీదేవి
- పాల్గొననున్న రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లు



శిల్పారామం ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని శిల్పారామంలో శుక్రవారం 'తెలంగాణ అర్బన్ స్టార్టప్ చాలెంజ్' పేరిట ఒక రోజు సదస్సు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ వర్క్‌షాపును పరిశీలించేందుకు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) టీకే శ్రీదేవి మహబూబ్‌నగర్ రానున్నారు. ముఖ్యంగా నగరాలు, పట్టణ ప్రాంతాలలో మెరుగైన పారిశుద్ధ్యం, వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ, నీటి శుద్ధికి సంబంధించి నవీన పద్ధతులను అవలంబించే విధానాలపై చర్చించనున్నారు. దీనికి జీహెచ్ఎంసీ మినహా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తప్పక హాజరుకావాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. కాగా, ఈపాటికే ఈ సదస్సు నిర్వహణకు స్థానిక మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శిల్పారామంలోని స్టాల్స్‌తో పాటు ఓపెన్ ఎయిర్ థియేటర్, సమావేశ హాలు, ప్రాంగణం మొత్తం శుభ్రం చేయించారు.

జోడో యాత్ర స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజాపాలన



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు

- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- చట్టసభల్లో సమన్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం:ఎమ్మెల్యే యెన్నం
- పాలమూరులో కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ

స్టేషన్ మహబూబ్‌నగర్: రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర స్ఫూర్తితో తెలంగాణలో ప్రజాపాలన కొనసాగుతోందని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఆర్‌అండ్‌బీ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా తెలంగాణ చౌరస్తా వరకు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ దేశంలో కులమతాలకతీతంగా అందరినీ ఏకం చేయడానికి రాహుల్‌గాంధీ 4 వేల కిలోమీటర్లు భారత్ జోడోయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులమతాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. దేశంలో అందరికీ సమాన అవకాశాలు రావాలని రాహుల్‌గాంధీ కులగణన నినాదాన్ని తీసుకోవడం జరిగిందన్నారు. ఆయన నిర్ణయం మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో చట్టం చేసినట్లు గుర్తు చేశారు. ఆ చట్టాన్ని కేంద్రానికి పంపిస్తే బీజేపీ ప్రభుత్వం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ చట్టసభల్లో సమన్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రజాప్రభుత్వం పాటుపడుతుందని అన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేలు రాహుల్‌గాంధీ బర్త్‌డేకేక్ కట్ చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ భవన్ ఆవరణలో యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, మిథున్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, నాయకులు వినోద్‌కుమార్, ఎన్‌పీ వెంకటేశ్, ఎం.సురేందర్‌రెడ్డి, సీజే బెనహర్, ఆనంద్‌గౌడ్, జహీర్ అక్తర్, సిరాజ్‌ఖాద్రీ, అజ్మత్ అలీ, వసంత, నవనీత, సాయిబాబా, ఫయాజ్, రాములుయాదవ్, గంజి ఆంజనేయులు, అవేజ్, తదతరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


ఆంజనేయులు (ఫైల్)

మల్దకల్: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులోని ఒండ్రు మట్టిలో ఇరుక్కుని మృతి చెందిన ఘటన బుధవారం అమరవాయి సమీపంలోని పెద్దచెరువులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. అడవిరావల్‌చెర్వుకు చెందిన ఆంజనేయులు (52) తనకున్న కొద్దిపాటి పొలంలో పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో ఉదయం ఇంటి నుంచి గ్రామస్తులతో కలిసి చేపల వేటకు పెద్దచెరువుకు వెళ్లాడు. చెరువులో చేపలు పట్టే క్రమంలో ఆంజనేయులు కొంత ముందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు మట్టిలో ఇరుక్కుపోయాడు. గమనించిన గ్రామస్తులు ఆంజనేయులు కాపాడేందుకు బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. ఆంజనేయులుకు భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


ఆది కర్ణాకర్ (ఫైల్)

పాన్‌గల్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం మండల కేంద్రం పాన్‌గల్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన ఆదికర్ణాకర్ (35) కారు నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. నాలుగు రోజుల క్రితం ఛాతీలో నొప్పి రావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతునికి ఏడాది క్రితమే వివాహమైంది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న కుమారుడి అకాల మరణంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బైక్, కారు ఢీ: వ్యక్తి దుర్మరణం

మిడ్జిల్: మోటార్ సైకిల్, కారు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన గురువారం 167 జాతీయ రహదారిపై మున్ననూర్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మెదక్ జిల్లా పరిధిలోని, సదాశివపేట్ మండలంలోని కంచాలపల్లి గ్రామానికి చెందిన కమ్మరి ప్రభాకర్ (40) బైక్‌పై జడ్చర్ల నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్నాడు. మున్ననూర్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న కారును ఢీకోనడంతో, మోటార్ సైకిల్‌పై ఉన్న ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ శివ నాగేశ్వర్‌నాయుడును వివరణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

మానవపాడు: రాత్రి సమయంలో నిద్రపోతున్న మహిళపై కుక్క దాడి చేసి గాయపరిచిన ఘటన గురువారం మండలంలోని చెన్నిపాడులో చోటుచేసుకుంది. చెన్నిపాడులోని బీసీ కాలనీలో మాబి అనే మహిళ రోజువారీలాగానే బుధవారం కూలి పనులకు వెళ్లి వచ్చి రాత్రి భోజనం చేసి నిద్రపోయింది. కొద్దిసేపటికే ఆమెపై కుక్క దాడి చేయడంతో రక్తగాయాలయ్యాయి. బాధితురాలిని వెంటనే మానవపాడులోని ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అనంతరం రాజుపై, బీసీ కాలనీలోని బా లుడు నందవర్ధన్ నిద్రిస్తున్న సమయంలో కుక్క దాడి చేసి గాయపరిచింది. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అయినా గ్రామంలో ఇంత వరకు అధికారులు ఎవ్వరూ రాలేదని, కుక్కల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు వాపోయారు.

ముష్టిపల్లిలో క్షుద్ర పూజల కలకలం



పెద్దకొత్తపల్లి: ఆస్తి కోసం కన్న కొడుకుకే క్షుద్ర పూజలు చేసి తల్లి, తమ్ముడు చంపాలని చూసిన ఘటన పెద్దకొత్తపల్లి మండలంలోని ముష్టిపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన బాలెమ్మ చిన్న కొడుకు శ్రీశైలంతో కలిసి పెద్దకుమారుడైన చిన్నకుర్మయ్యకు సంబంధించిన పాస్‌ఫొటోతో బొమ్మను తయారు చేసి వారం రోజుల క్రితం పూజలు నిర్వహించారు. అనంతరం బొమ్మను గ్రామం శివారులోని చెరువులో వేశారు. అప్పటి నుంచి చిన్నకుర్మయ్య అనారోగ్యానికి గురైయ్యాడు. గురువారం తల్లి, తమ్ముడు కలిసి క్షుద్రపూజలు చేసి చెరువులో వేసిన బొమ్మను తీస్తుండగా గ్రామస్తులు చూసి వారిని పట్టుకొని ప్రశ్నించగా క్షుద్రపూజలు నిర్వహించినట్లు వారు ఒప్పుకున్నారు. బాలెమ్మ, శ్రీశైలం ఇంట్లో గ్రామస్తులు పరిశీలించగా క్షుద్రపూజలకు ఉపయోగించే వస్తువులు లభ్యమయ్యాయి. వారిద్దరిని గ్రామస్తులు చితకబాదడంతో ఊరి వదిలి పారిపోయారు. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

ఇసుక క్వారీలో ముష్టి యుద్ధం


దుందుభీ వాగులో తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఇసుక

- అర్ధరాత్రి అధికార, విపక్ష నేతల వీరంగం
- ఒకరిపై ఒకరు ఆరోపణలు
- ప్రేక్షక పాత్రలో పోలీసులు

జడ్చర్ల: మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని దుందుభీ వాగులో ఉన్న ఇసుక క్వారీలో బుధవారం అర్ధరాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇసుక తరలింపు కోసం కొందరు ముష్టి యుద్ధానికి దిగారు. అరుపులు, కేకలు, ఈలలతో ఆ ప్రాంతం హోరెత్తింది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఇసుక క్వారీ వద్దకు చేరుకొని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించి.. తమ పని పూర్తయిందనిపించారు. అయితే గొడవకు కారణమైన వారి నుంచి మొబైల్ ఫోన్లు, వాహనాలు స్వాధీన పర్చుకున్న పోలీసులు.. తదుపరి ఓ నాయకుడి ఫోన్ కాల్‌తో ఎవరివి వారికి ఇచ్చినట్లు సమాచారం.


ఇసుక క్వారీ గేటు వద్ద విరిగిన తాళం

అసలేం జరిగిందంటే..

కొత్తపల్లి శివారులో ప్రభుత్వ అనుమతి పొందిన ఇసుక క్వారీ నిర్వాహకులు రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు జడ్చర్లకు చెందిన అధికార పార్టీ నాయకులతో పాటు ఇసుకాసురులు నిఘా ఉంచారు. తమ వారు నిబంధనల మేరకు టీజీఎండీసీకి డీడీలు చెల్లించినా క్వారీ నిర్వాహకులు తమ టిప్పర్లలో ఇసుక లోడింగ్ చేయకుండా.. రాత్రివేళల్లో నిత్యం 30 నుంచి 40 టిప్పర్లలో ఇసుకను హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారని వారు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకునేందుకు తాము క్వారీ వద్దకు వెళ్లగా.. క్వారీ నిర్వాహకులతో సంబంధం ఉన్న ఓ బీఆర్‌ఎస్ నాయకుడు తన అనుచరులతో కలిసి ఎదురుదాడి చేశారని ఆరోపించారు. కాగా, అధికార పార్టీకి చెందిన కొందరు అర్ధరాత్రి సమయంలో టిప్పర్లు, జేసీబీలతో ఇసుక క్వారీ వద్దకు చేరుకొని తమ సిబ్బందిని చెట్టుకు కట్టేసి ఇసుకను అక్రమంగా తరలించారని క్వారీ నిర్వాహకులు చెబుతున్నారు.

పారదర్శకంగా విచారించాలి..

దుందుభీ వాగులో ఇసుక క్వారీ నిర్వహణ, అక్రమాల ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇందులో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీలు తమ పారదర్శకతను నిరూపించుకోవాలని కోరుతున్నారు. జడ్చర్ల మండలానికి చెందిన ఓ బీఆర్‌ఎస్ నేత క్వారీలో చక్రం తిప్పుతున్నాడని సొంత పార్టీ నాయకులే ఆరోపిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇరు పార్టీల నాయకులు ఇసుక మాఫియాతో చేస్తున్న వ్యవహారాలను బయటపెట్టాలన్న డిమాండ్ ఉంది.

అధికారుల తీరుపై విమర్శలు..

ఇసుక క్వారీ నిర్వహణకు అనుమతులు ఇచ్చిన టీజీఎండీసీ, రెవెన్యూ, నీటిపారుదల, మైన్స్ తదితర శాఖల అధికారుల తీరును స్థానికులు తప్పుపడుతున్నారు. డార్క్ ఏరియాగా గుర్తించిన మిడ్జిల్ మండలంలో ఇసుక క్వారీ అనుమతులకు సిఫార్సు చేయకూడదని.. కానీ అమ్యామ్యాల కోసం సిఫార్సులు చేసి కలెక్టర్‌ను సైతం తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తున్నారు. ఇక అనుమతులు పొందిన తర్వాత నిబంధనల మేరకు క్వారీ నిర్వహణ కొనసాగాల్సి ఉండగా.. దర్జాగా ఇసుక అక్రమ రవాణాకు తెర తీశారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఇసుక క్వారీ నిర్వహణపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతున్నారు. కాగా, ఇసుక క్వారీ వద్ద అర్ధరాత్రి చోటు చేసుకున్న ఘటనపై విచారించి చర్యలు తీసుకుంటామని జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ తెలిపారు.

జైలు శిక్ష ఖరారు.. అంతలోనే తప్పించుకున్న నిందితుడు


పట్టుబడిన ఎస్.కృష్ణ.


దోషులను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

గద్వాల క్రైం: దౌర్జన్యంగా పొలంలోకి ప్రవేశించి రైతును భయభ్రాంతులకు గురిచేసిన నలుగురు నిందితులకు గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా కోర్టు న్యాయమూర్తి రెండు సంవత్సరాల రెండు నెలల జైలుశిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెల్లడించారు. ఈ క్రమంలో ఓ నిందితుడు పోలీసుల కళ్లుగప్పి తప్పించుకోవడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. గట్టు మండలకేంద్రానికి చెందిన గూడూరు నాగరాజుకు గ్రామ సమీపంలోని 258 సర్వే నంబర్‌లో 39 గుంటల వ్యవసాయ భూమి ఉంది. అయితే 2016 జూన్ 16న అదే గ్రామానికి చెందిన ఎస్.కృష్ణ, పెద్ద మూకన్న, చిన్న మూకన్న, గుండన్నలు దౌర్జన్యంగా పొలంలోకి ప్రవేశించి సదరు రైతును భయభ్రాంతులకు గురిచేశారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు గట్టు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి గద్వాల కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో 2024లో అప్పటి న్యాయమూర్తి నిందితులకు రెండు సంవత్సరాల రెండు నెలలు జైలుశిక్షతో పాటు రూ.1000 జారిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితులు జిల్లా కోర్టును ఆశ్రయించారు. గురువారం జిల్లా కోర్టులో సదరు కేసును న్యాయమూర్తి ప్రేమలత విచారించి.. కింది కోర్టు ఉత్తర్వును పరిగణనలోకి తీసుకున్నారు. అప్పటి న్యాయమూర్తి తీర్పునే ఖరారు చేస్తూ తీర్పు వెల్లడించారు. అయితే కోర్టు తీర్పును తెలుసుకున్న నిందితుడు ఎస్.కృష్ణ పోలీసుల కళ్లుగప్పి అక్కడి నుంచి పరారయ్యాడు.

గంట వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు..

నిందితులకు జైలుశిక్ష ఖరారు చేసిన క్రమంలో నిందితుడు ఎస్.కృష్ణ క్షణాల వ్యవధిలోనే తప్పించుకున్నాడు. పోలీసు సిబ్బంది పట్టుకునే ప్రయత్నం చేయగా.. గుర్తు తెలియని బైక్‌పై పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందంతో గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు పట్టణ శివారులో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో పోలీసుల కళ్లుగప్పి నిందితుడు తప్పించుకోవడం.. గంట వ్యవధిలోనే అతడిని పోలీసులు పట్టుకోవడం హాట్‌టాపిక్‌గా మారింది. కాగా, తప్పించుకున్న నిందితుడిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఎస్.కృష్ణతో పాటు పెద్ద మూకన్న, చిన్న మూకన్న, గుండన్నలను మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ శ్రీను తెలిపారు.

'ఎస్‌ఎస్‌సీ' పోస్టుల భర్తీకి దరఖాస్తులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే సెలక్షన్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు జూన్ 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ రీజినల్ డైరెక్టర్ కే. రగుల్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఫేజ్- గీఐఐ-2025- సెలక్షన్ పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ జూన్ 2న ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. నోటిఫికేషన్ ద్వారా వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఉన్న భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు నివేదించిన వివిధ పోస్టులకు ప్రత్యక్ష నియామకం కోసం దక్షిణ రీజియన్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఓపెన్ కాంపిటేటివ్‌కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తుందన్నారు. అభ్యర్థులు స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ వెబ్‌సైట్ https://ssc.gov.inలో ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు వీలుందన్నారు. దరఖాస్తులను జూన్ 23వ తేదీలోగా సమర్పించాలని, పరీక్ష ఫీజు చెల్లింపునకు జూన్ 24 చివరి తేదీ అని తెలిపారు. సౌత్ రీజియన్ (దక్షిణ ప్రాంతం), కంప్యూటర్ ఆధారిత పరీక్ష 24 జూలై 2025 నుంచి 4 ఆగస్టు 2025 వరకు 24 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 12, పుదుచ్చేరిలో 01 , తమిళనాడులో 08, తెలంగాణలో 3 కేంద్రాల్లో ఓపెన్ కాంపిటేటివ్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పోస్టుల వివరాలు, వయో పరిమితి, విద్యార్హత, చెల్లించాల్సిన రుసుం, పరీక్ష నియమావళి, దరఖాస్తు విధానం మొదలైన వివరాలకు సంబంధించి సమాచారానికి ttps://ssc.gov.in/rhq&selection&post/ rhq&post&details వెబ్‌సైట్ పరిశీలించాలని పేర్కొన్నారు.

భాస్వరంతో నేలకు పోషకాలు


భాస్వర లోపం ఉన్న వరి పంట


మొక్కజొన్నలో భాస్వర లోపం

పాడి-పంట
జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: భూమి సారానికి భాస్వరం ముఖ్యమైన పోషకమని వ్యవసాయ జిల్లా అధికారి సక్రియానాయక్ అన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే గాలి, నీరులానే మొక్కకు కావాల్సిన 16 రకాల పోషకాలు సాగు భూమి ద్వారా లభ్యమవుతాయి. వీటిలో నత్రజని, భాస్వరం పోషకాలు తక్కువ పరిమాణంలో, పొటాష్ ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. ఈ పోషకాలు ఇసుక భూములు, మధ్యస్థ నేలలు, ఎర్రగరప నేలలు, నల్లరేగడి భూముల్లో తక్కువ శాతం ఉండే అవకాశాలు ఉన్నాయి. పోషక పదార్థాల లభ్యత నేల రకం, భౌతిక స్థితి, రసాయన లక్షణాలు, సూక్ష్మజీవుల చర్య, వాతవరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

ప్రాముఖ్యం..

- భాస్వరాన్ని లవణాల రూపంలో మొక్కలు తీసుకుంటాయి.
- పూలు, విత్తనాలు, దుంపలు తదితర ఆర్థిక ప్రాముఖ్యత గల పంటల్లో విత్తనపు భాగాల్లో ఈ పోషకం అవసరం ఎక్కువే.
- భూమిలో సేంద్రియ ఎరువులు బాగా కుళ్లేందుకు దోహదపడుతుంది.
- పంట త్వరగా పక్వానికి వస్తుంది.
- కణ విభజన, పైరు అభివృద్ధి, మొక్క తొందరగా నిలదొక్కుకోవడం, మొక్కలో మాంసకృతులు, ఎంజైముల తయారీకి ఉపయోగపడుతుంది.
- భాస్వరం తగినంత ఉంటే నత్రజని ఎక్కువైనా పైర్లకు కలిగే దుష్ఫలితాలను కొంత మేరకు అరికడుతుంది.
- మొక్కలకు అవసరమైన పిండి పదార్థం తయారు చేసుకోనే కిరణజన్య సంయోగక క్రియలో కీలకపాత్ర వహిస్తోంది.
- మొక్కల ఉఛ్వాస, నిశ్వాసలకు నైట్రోజన్ వాడకం, ఎంజైములు ఉత్పత్తిలోనూ పాస్ఫరస్ అవసరం. ఈ మూలకం లోపిస్తే మొక్కల వేర్ల పెరుగుదల బలహీనమవుతాయి.

ఏ దశలో వేయాలి

భాస్వరం ముఖ్యంగా వేరు వ్యవస్థను అభివృద్ధి పరుస్తోంది. వరి పంటలో నాట్లకు ముందు మురుగు దమ్ము చేసేటప్పుడు సింగిల్ సూపర్ పాస్ఫేట్ 75 నుంచి 100 కిలోలు, 20 కిలోల యూరియా కలిపి తప్పనిసరిగా వేయాలి. లేదా వరి నాటిన తర్వాత పది రోజులకు డీఏపీ ప్లస్ యూరియా లేక ఇతర భాస్వరం పోషకం కలిగిన కాంప్లెక్స్ ఎరువులు వేసుకోవాలి.

- వర్షాధార మెట్ట పంటలు పత్తి, వేరుశనగ, మొక్కజొన్న మొదలగు పంటలకు ఆఖరి దుక్కిలో వేయాలి.

ఏ మేరకు వాడాలి

మట్టి నమునాల్లో వచ్చే భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే సాగులో ఉన్న వివిధ పంటలకు ఎంత భాస్వరం అవసరమో తెలుస్తోంది. దీనిని బట్టి పశువుల, పచ్చిరొట్ట, జీవన, రసాయన ఎరువుల ద్వారా భాస్వరాన్ని అందజేయాలి. సింగిల్ సూపర్ పాస్ఫేట్ డీఏపీ, ఎన్‌పీకే కాంప్లెక్స్ ఎరువులు మొదలగు వాటి ద్వారా భాస్వరాన్ని అందజేయవచ్చు.

జీవన ఎరువుల వలన ఉపయోగాలు

జీవన ఎరువుల్లో బాసిల్లాస్, సూడోమోనాస్ వంటి సూక్ష్మజీవులు ఆస్పర్జిల్లడ్, పెన్సిలియం వంటి శీలింద్రాలు భూమిలో కరగని రూపంలో భాస్వరాన్ని కరిగించి మొక్కకు లభ్యత పెంచుతాయి. సిఫార్సు చేసిన భాస్వర మోతాదును ఎకరాకు 10 నుంచి 12 కిలోల వరకు తగ్గించుకోవచ్చు. మట్టి నమునాల్లో భాస్వరం విలువ 20 కంటే తక్కువ గల భూములను 21 నుంచి 50 వరకు మధ్య భూములుగా పరిగణించబడతాయి.

కరగని రూపంలో..

సాగవుతున్న భూముల్లో 60 శాతం కంటే ఎక్కువగా ఉన్న భాస్వరం కరగని డై కాల్షియం, ట్రై కాల్షియం ఫాస్ఫేట్‌ల రూపంలో ఉంది. తేలిక భూముల్లో కంటే బరువు నేల(వరి పండించే డెల్టా భూములు)ల్లో భాస్వరం పోషకం ఎక్కువ శాతం మొక్కలకు అందుబాటులో లేని రూపంలో ఇమిడీకృతమై ఉంది. ఈ నేలల్లో భాస్వరం వినియోగ సామర్థ్యం తక్కువేనని చెప్పవచ్చు. రైతులు వాడే భాస్వరపు ఎరువుల్లోని భాస్వర పోషకం మోనో కాల్షియం పాస్ఫేట్ రూపంలో ఉంటుంది. ఇది పూర్తిగా నీటిలో కరుగుతుంది. కరిగిన వెంటనే నేలలోని అల్యూమినియం, ఐరన్ ఆక్సైడ్‌లతోనూ కాల్షియం, మెగ్నీషియం కార్బోనేట్లతోనూ రసాయన చర్య జరుగుతుంది.

ఆందోళనల మధ్య అక్రమ నిర్మాణాల తొలగింపు


అధికారులతో వాగ్వాదానికి దిగిన నిర్వాసితులు

- 300 మంది పోలీసుల పహారా
- సర్వం కోల్పోయామంటూ బాధితుల ఆవేదన


సిర్సనగండ్లలో ఇళ్లను కూల్చుతున్న దృశ్యం

చారకొండ: అపరభద్రాద్రిగా పేరొందిన చారకొండ మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ దిగువన స్థలంలోని అక్రమ నిర్మాణాలను కోర్టు ఉత్తర్వుల మేరకు నిర్వాసితుల వాదనలు, నిరసనలు, అధికారులు, పోలీస్ బందోబస్తు నడుమ గురువారం తొలగించారు. ఆలయానికి సంబంధించి సర్వే నంబర్ 327, 328 స్థలంలో సిర్సనగండ్ల, అగ్రహారం తండా ప్రజలు కొన్నేళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకోని జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేవాలయ భూమిలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని గతంలో దేవాలయ కమిటీ చైర్మన్ రామవర్మ కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు 23 జనవరి 2024లో ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని సంబంధిత దేవాదాయ, పోలీసు, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. ఈ క్రమంలో ఆక్రమణదారులు కొంత సమయం కావాలని కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఇచ్చిన గడువు ముగియడంతో బాధితులకు నోటీసులు అందించి గురువారం కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఏసీ మదనేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో 34 ఇళ్లను నేలమట్టం చేశారు.

పటిష్ట బందోబస్తు

ఇళ్ల కూల్చివేతలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ శంషోద్దీన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి, అచ్చంపేట సీఐలతో పాటు ఇతర మండలాల ఎస్‌ఐలు సూమారు 300 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇళ్ల కూల్చివేత సమయంలో పలువురు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆందోళన చేస్తున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బాధితుల ఆవేదన

గత 30 సంవత్సరాల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నామని, ఉన్న ఫలంగా ఖాళీ చేయాలంటే ఎక్కడికి వెళ్లాలని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు నిర్మాణాలు కూల్చివేశారు. కార్యక్రమంలో సీఐలు నాగర్జున, నాగరాజు, వెంకట్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూగర్భ కేంద్రాన్ని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు


ట్రైనీ ఐఏఎస్‌లతో భూగర్భ కేంద్రం సీఈ, ఎస్‌ఈ, ఇంజినీర్లు

దోమలపెంట: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రాన్ని గురువారం 2024 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్‌లు హర్ష చౌదరి, సౌరభ్‌శర్మ, సలోని చాబ్రా, ఖర్లాన్ చిగ్రి యాన్వీ సందర్శించారు. వారికి కేంద్రం సీఈ రామసుబ్బారెడ్డి, ఎస్‌ఈ ఆదినారాయణ, ఎస్‌ఈ (సివిల్) రవీంద్రకుమార్ సాదరంగా స్వాగతం పలికారు. కేంద్రంలో విద్యుదుత్పత్తి సామర్థ్యం, యూనిట్ల పనితీరు, మెయిన్ కంట్రోల్ రూం నుంచి లోడ్ డిస్పాచ్‌కు విద్యుత్ సరఫరా, పంప్‌మోడ్ పద్ధతిలో సాగర్ జలాశయం నుంచి శ్రీశైలంలోకి నీటిని ఎత్తిపోత, ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం, శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వ తదితర వివరాలను సీఈ వివరించారు. అనంతరం కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ట్రైనీ ఐఏఎస్‌లు కేంద్రం ఇంజినీర్లతో కొద్దిసేపు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజిటింగ్ బుక్‌లో భూగర్భ కేంద్రం అద్భుతంగా ఉందని ట్రైనీ ఐఏఎస్‌లు అభిప్రాయపడ్డారు.

జూరాలలో జోరుగా విద్యుదుత్పత్తి

- 11 యూనిట్లలో 435 మెగావాట్ల ఉత్పత్తి
- 39 వేల క్యూసెక్కుల నీటి వినియోగం


దిగువ జూరాలలోని పవర్‌హౌజ్ కేంద్రం

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక రాష్ట్రం నుంచి వరద నీరు చేరుతుండడంతో దిగువ, ఎగువ జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగంగా కొనసాగుతుంది. ఈమేరకు గురువారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపడుతున్నట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 34.713 ఎంయూ, దిగువలో 6 యూనిట్లద్వార 240 మెగావాట్లు, 38.506 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ప్రస్తుతం 39 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించి ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 73.219 ఎంయూల విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

శ్రీశైలానికి 38,663 క్యూసెక్కులు

దోమలపెంట: జూరాలలో గురువారం విద్యుదుత్పత్తి చేస్తూ 36,415 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 2,248 మొత్తం 38,663 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. ప్రస్తుతం శ్రీశైలంలో నీటిమట్టం 847.1 అడుగుల వద్ద 73.9870 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో శ్రీశైలంలో విద్యుదుత్పత్తి, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు నీటి విడుదల జరగలేదు.

ప్రభుత్వ ఉద్యోగం పేరుతో యువతికి టోకరా

భూత్పూర్: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని ఓ యువతితో రూ. 7లక్షలు చేసిన ఉదాంతం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. నవాబుపేట మండలం తీగలపల్లికి చెందిన రామాంజమ్మ 2023లో తన సమీప బంధువు అయిన భూత్పూర్ మండలం కొత్తూర్‌కు చెందిన బోయిని కల్పనకు ఎస్‌ఐ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించింది. ఈ క్రమంలో రామాంజమ్మ తనకు తెలిసిన వారు ఉన్నారని ఆత్మకూర్ మండలం చిన్న కన్మనూర్‌కు చెందిన నాగేశ్వర్‌రెడ్డిని కల్పనకు పరిచయం చేసింది. అతడు ఓ మాజీ మంత్రి ఇంట్లో పనిచేస్తున్న సుచిత, సురేశ్ అనే వ్యక్తులను పరిచయం చేశాడు. వీరందరూ కలిసి బోయిని కల్పన వద్ద రూ. 7లక్షలు తీసుకున్నారు. అయితే సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోడంతో తాను మోసపోయానని కల్పన గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

కొత్తకోట రూరల్: మహిళను హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు పంపించారు. పెద్దమందడి మండలంలోని గట్లుఖానాపూర్ గ్రామంలో ఈ నెల 18న రేణుక(41) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. దీనిపై బాధితురాలి కుమార్తె వెన్నెల ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానితుడైన కురుమూర్తిని పోలీసులు పట్టుకుని తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు గురువారం పెద్దమందడి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గట్లుఖానాపూర్ గ్రామంలో మహిళ అనుమానస్పద స్థితిలో మృతిచెందిన ఘటనను సీఐ రాంబాబుతో పరిశీలించడంతోపాటు క్లూస్ టీంతో వివరాలు సేకరించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో అనుమానితుడైన కురుమూర్తిని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. రేణుకకు భర్త లేకపోవడంతో కురుమూర్తితో గత కొన్నేళ్లుగా పరిచయం ఉంది. దీంతో కురుమూర్తి ఈనెల 18న రేణుక ఇంటికి వచ్చి ఆమెను తీసుకుని సమీపంలో గల ఎవరూ లేని ఓ ఇంటి ఆవరణలో జరిగిన ఘటనలో రేణుక తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కేసును త్వరగా ఛేదించిన ఎస్‌ఐ శివకుమార్‌తోపాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.